# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## తెలంగాణ రాష్ట్ర కమిటీ

**పత్రికా ప్రకటన** **తేదీ: 03-06-2023**

## కార్మిక వర్గ పుత్రుడు, మేధావి, రాజకీయవేత్త, సైద్ధాంతిక వ్యూహ కర్త, సమర యోధుడు, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కటకం సుదర్శన్ (ఆనంద్, దూలా) అమర్ రహె!

**జూన్ 5నుండి ఆగస్టు 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కామ్రేడ్ కటకం సుదర్శన్ స్మారక సభలను నిర్వహించండి!!**

కార్మిక వర్గ పుత్రుడు, మేధావి, సీనియర్ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కటకం సుదర్శన్(ఆనంద్, దూల) భౌతికంగా మనకిక లేరు. మే,31,2023 మధ్యాహ్నం 12.20 గంటలకు గుండె పోటుతో దండకారణ్య గెరిల్లా జోన్‌లో తుది శ్వాస విడిచారు. భారత విప్లవోద్యమ నిర్మాణంకై 69 సంవత్సరాల జీవితంలో 48 సంవత్సరాలుగా అలుపెరగకుండా అనేక రంగాల్లో పని చేసిన శ్రమజీవి కా. కటకం సుదర్శన్‌ది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, బెల్లంపల్లి పట్టణం. సింగరేణి కార్మిక కుటుంబంలో జన్మించాడు. బెల్లంపల్లి పట్టణంలో ప్రాథమికోన్నత విద్యను అభ్యసించి డిగ్రి మంచిర్యాలలో పూర్తి చేశాడు. ఇక్కడి నుండి మైనింగ్ డిప్లొమా చదవడానికి హైదరాబాద్ వెళ్ళాడు. బెల్లంపల్లి పట్టణంలో కమ్యూనిస్టు రాజకీయాల ప్రభావం వుండడంతో సహజంగానే విప్లవ రాజకీయాల పట్ల ఆశక్తి పెంచుకున్నాడు. 1967లో జరిగిన నగ్జల్బరి, శ్రీకాకుల రైతాంగ పోరాటాలతో ఉత్తేజితుడై 1974-75లో తను హైదరాబాద్‌లో మైనింగ్ డిప్లొమా చేస్తూ రాడికల్ విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలంగా పని చేశాడు. నగ్జల్బరీ, శ్రీకాకుళం రైతాంగ పోరాటాలు దెబ్బతిన్నప్పటికి పార్టీ రాజకీయ పంథాను బలంగా నమ్మిన కా. కటకం సుదర్శన్ రాజకీయ, సైద్ధాంతిక దృఢ సంకల్పంతో పని చేశాడు. సిపిఐ(ఎంఎల్) కేవస్ నాయకత్వంలో బెల్లం పల్లి పట్టణంలోని సికాస ఉద్యమంలో రహస్య సెల్ సభ్యుడుగా వున్నాడు. ఎమర్జెన్సీ కాలంలో అత్యంత రహస్యంగా సెల్ సభ్యుడుగా కొనసాగుతూ బెల్లంపల్లి, మంద మర్రి, రామకృష్ణ పురం, శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులను, విద్యార్థులను, రైతాంగాన్ని కలుస్తూ సికాస ఉద్యమాన్ని నిర్మించాడు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత 1978లో గ్రామాలకు తరలండి అనే పార్టీ పిలుపుతో లక్సెటి పేట - జన్నారం ప్రాంతంలో ఆర్గనైజర్‌గా వెళ్ళి పని చేశాడు. 1979లో కా. నల్లా ఆదిరెడ్డి, కా. కటకం సుదర్శన్, గజ్జల గంగారంతో ఆదిలాబాద్ జిల్లా కమిటి ఏర్పడింది. కా. కటకం సుదర్శన్ నాయకత్వంలో సింగరేణి కార్మిక వర్గంపై కేంద్రీకరించి బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాల నుండి యువతను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించి, ఆదివాసీ గ్రామీణ ప్రాంతాలలో వర్గ పోరాటాలను నిర్మించి విస్తరింప చేశారు. ఈ సమయంలో ఫారెస్టు అధికారుల దోపిడి, వడ్డీ షావుకారుల దోపిడికి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలను కదిలించారు. ఎమర్జెన్సీ కాలంలో ఆదివాసీల భూములను బలవంతంగా లాక్కొని తమ భూముల నుండి బేదకలు చేస్తే తమ భూమి కోసం ఆదివాసీ ప్రజలంతా ఐక్యమై పెద్ద ఎత్తున కదిలి పోరాడుతున్న ఆదివాసీ రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో విచక్షణారహితంగా కాల్పులు జరిపి 70 మంది ప్రజలను పాశవికంగా చంపింది. 1980లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా వుండి, ఇంద్రవెల్లి ఉద్యమానికి కా. కటకం సుదర్శన్ నాయకత్వం వహించాడు. 1985 వరకు జిల్లా కమిటీ కార్యదర్శిగా పని చేశాడు. మన పార్టీ తీసుకున్న గెరిల్లా జోన్ పరస్పెక్టీవ్‌లో భాగంగా దండకారణ్యానికి ఏడు దళాలను పంపినప్పుడు మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లా సిరొంచ దళానికి కా. కటకం సుదర్శన్ బాధ్యత వహించాడు. ఈ దళంపై మొదటి సారి ఎన్‌కౌంటర్ జరగడంతో కా. పెద్ది శంకర్ అమరుడయ్యాడు. ఆదిలాబాద్, గడిచిరోలి, బస్తర్, తూర్పు గోదావరిని కలుపుకొని దండకారణ్యంగా వెనకతట్టు ప్రాంతాలను ఎన్నుకున్నారు. ఈ ప్రాంతమంతా విప్లవోద్యమం విస్తరించడంతో 1985లో ఫారెస్టు లైజన్ కమిటీ(ఎఫ్ఎల్‌సీ) ఏర్పడిన కమిటీలో సభ్యుడుగానూ, ఆ తరువాత 1987 నుండి 1995 వరకు ఫారెస్టు కమిటీలో సభ్యుడుగా కొనసాగాడు.



1995లో కొత్తగా ఏర్పడిన ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ (ఎన్‌టీఎస్‌జడ్‌సీ)కి కార్యదర్శిగా నియమించబడినాడు. 1995లో జరిగిన ఆల్ ఇండియా స్పెషల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర కమిటీ సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు. అలాగే 2001లో జరిగిన 9వ కాంగ్రెస్ కేంద్ర కమిటీ సభ్యుడుగా, పొలిట్ బ్యూరో సభ్యుడుగానూ ఎన్నుకుంది. 2007లో జరిగిన 9వ ఐక్యత కాంగ్రెస్‌లో తిరిగి మరోసారి కేంద్ర కమిటీ సభ్యుడుగా, పొలిట్ బ్యూరో సభ్యుడుగా ఎన్నుకోబడ్డాడు. 2001 నుండి 2017 వరకు సీఆర్‌బీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ భారత విప్లవోద్యమానికి ఎనలేని సేవలందిస్తూ వచ్చాడు.

సీపీఐ(ఎంఎల్) పీపుల్స్ వార్‌లో రెండు సంక్షోభాలు వచ్చాయి. 1985లో కేజీ సత్యమూర్తి సృష్టించిన సంక్షోభంలో, 1992లో కొండపల్లి సీతారామయ్య సృష్టించిన రెండవ సంక్షోభంలోనూ దృఢంగా నిలబడి క్యాడర్‌ను నిలబెట్టగలిగాడు. ఆయన ఉద్యమ ఆటు పోటుల్లో, కష్ట నష్టాల్లో ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి అనారోగ్యం పట్టి పీడిస్తున్నా, వయస్సు సహకరించకున్న జీవితమంతా భారత విప్లవోద్యమ పురోగమనానికై నిరంతరం పరితపించేవాడు. తన చివరి క్షణాల్లో కూడా కేంద్ర కమిటీ కీలకమైన తీర్మానాలు రాస్తూ రాస్తూనే తన శ్వాస విడిచాడు.

దేశంలో వున్నా సాయుధ పోరాట మార్గంలో పని చేస్తున్న విప్లవ గ్రూపులను ఐక్యం చేసి సిపిఐ(మావోయిస్టు) ఏర్పాటులో కీలక భూమిక పోషించాడు.

కా. కటకం సుదర్శన్ పత్రికా రంగంలో విశేష కృషి చేశాడు. కేంద్ర రీజినల్ బ్యూరో రాజకీయ ప్రచార క్రాంతి పత్రికను నడిపించాడు. పీపుల్స్ మార్చ్ పత్రికకు బాధ్యత వహిస్తూ అంతర్జాతీయంగా భారత విప్లవ రాజకీయాలను ప్రభావితం చేయగలిగాడు. ఆదిలాబాద్ జిల్లా ఉద్యమానికి నాయకత్వం వహించినప్పుడు ఆ ఉద్యమ స్థితిని ప్రతి బింబించేలా వసంత గీతం నవలను రాశాడు. ఇంద్రవెల్లి నలభై యేళ్ళ పోరాట స్ఫూర్తిని ఎత్తిపడుతూ చారిత్రాత్మకమైన డాక్యుమెంట్‌ను రచించాడు. దేశంలో భూ సంబంధాల్లో, ఉత్పత్తి సంబంధాల్లో వచ్చిన మార్పులను అధ్యయనం చేసి పార్టీ ముందుంచాడు. పట్టణ, మైదానాల్లో సామాజిక మార్పులను నిశితంగా పరిశీలించి, విశ్లేంచాడు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ప్రజాస్వామిక తెలంగాణ కోసం కీలక పాత్ర పోషించాడు. సెట్ బ్యాక్‌లో వున్నా తెలంగాణ, ఏపి, ఏఓబి ఉద్యమాలను పునర్ నిర్మాణం కోసం సైద్ధాంతిక, రాజకీయ నిర్మాణ కృషి చేశాడు. బ్రాహ్మణీయ హిందుత్వ (మను వాదం, జాతీయ ఉన్మాదం) ఫాసిజంన్ని తిప్పి కొట్టడానికి దేశ ప్రజలను ఐక్యం చేయడంలో కీలక భూమిక పోషించాడు. కా. దూల దాదా గొప్ప రాజకీయ వేత్త, సిద్ధాంత వేత్త, వ్యూహా కర్త, కార్మిక వర్గ మేధావి, తన చరిత్ర చెప్పడమంటేనే భారత విప్లవోద్యమ చరిత్రను చెప్పడం.

అంకిత భావం, దృఢ సంకల్పం, క్రమశిక్షణ, విమర్శనాత్మక దృక్పథం, ఉన్నతమైన కమ్యూనిస్టు విలువలను అందించిన కా. కటకం సుదర్శన్ అమరత్వం భారత విప్లవోద్యమానికి, ప్రపంచ సోషలిస్టు విప్లవానికి తీరని నష్టాన్ని కలిగించింది. తన జీవితాన్నే విప్లవోద్యమానికి అంకితం చేసిన కా. కటకం సుదర్శన్‌కు తెలంగా రాష్ట్ర కమిటీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నది. కా. కటకం సుదర్శన్ కుటుంబానికి, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతుంది. కటకం సుదర్శన్ ఆశయాలను, ఆదర్శాలను తుద వరకు తీసుకెళ్తామని తెలంగాణ రాష్ట్ర కమిటీ శపథం చేస్తున్నది.

Jagan

**జగన్**

**అధికార ప్రతినిధి**